# హక్కు

## మాదిరెడ్డి సులోచన



"అన్నయ్యా! మీరు కూడానా!"

దేవయాని ఆశ్చర్యంగా చూచింది. ఆ ఆవేదనలో 'యూటూ బ్రూటస్' అంటూ ఆశ్చర్యంగా చూచిన అలనాటి రోమన్ చక్రవర్తి జూలియస్ సీజర్ బాధ కనిపించింది. "అవునమ్మా! నీకు హక్కులేని విషయాలలో తలదూర్చటం అనవసరం." అన్నాడు రాము.

"అది కాదన్నయ్యా! ...." ఏదో చెప్పబోయింది.

"నాకు వివరాలు, వివరణలు వినటం ఇష్టంలేదు." అన్నాడు. అంతవరకు అక్కడ పేపరు ముఖానికి అడ్డం పెట్టుకుని కూర్చున్న దేవయాని భర్త పరశురామ్ విసురుగా లేచాడు.

"అయిందా, ఇంకా ఏమయినా అవమానం మిగిలిందా?" అన్నాడు కోపంగా.

దేవయాని వాళ్ల ముందు కళ్లనీళ్లు బయటపడరాదని శతవిధాలుగా ప్రయత్నించింది. ఆమెకు దక్షయజ్ఞంలో పార్వతి గుర్తుకు వచ్చింది. 'ఆడపిల్లలు పుట్టిన ప్రతీవారికి సతీదేవి అనవాయితీ తప్పదేమో.'

దేవయాని మెల్లగా లేచి బయటికి వస్తుంటే వదినగారు చిన్నగా నవ్వింది.

"ఈ అనుకోవటాలు, అనునయింపులు యెప్పటికీ ఉండేవేలే. కాఫీ తీసుకుని వెళ్లండి." అన్నది. ఆమె స్థితి చూస్తే పిచ్చిగిల్లి జోలపాడినట్టుంది.

"ఇప్పుడు కడుపులో అరఅంగుళం కూడా స్థానంలేదు. మళ్లీ వస్తాము వదినా!" అని వచ్చి పరశురామ్ స్కూటర్ వెనుక ఎక్కేసింది దేవయాని. పరశురామ్ కూడా తన కోపంఅంతా స్కూటర్ పైన చూపాడు. ఇద్దరూ ఇల్లుచేరారు. యెన్నడూ లేనిది పరశురామ్ సార్థక నామధేయుడు అనిపించాడు. దేవయాని రెక్కపట్టి పడకగదిలోకి ఈడ్చివేసాడు.

"మనిషి అన్నాక సిగ్గు, లజ్జ ఉండాలి. పుట్టింటివారంటే పడిచస్తుంది. మానాన్న ఒంటరివాడు, మానాన్న కష్టజీవి అంటూ పట్టుకు తిరిగింది? ఏం కోడండ్లు చేయకూడదా! మా అమ్మ, నాన్నలకు మనము చేస్తున్నాము. మా అప్పచెల్లెండ్లు వచ్చి వెళ్లిపోతున్నారు. స్టుపిడ్! సేవచేయటమే

హుక్కు అన్నట్టు అరవవాకిరీ చేసింది. నీ కసలు ఉద్యోగంచేసి సంపాదిస్తున్నా నని గర్వం...." అని ఆవేశంగా బయటకి వెళ్లిపోయాడు. దేవయానికి ఏడ్పు కూడా రాలేదు. అందరూ అవమానించినప్పుడు, పరశురామ్ అనునయింపు మాటలకు కరిగి కన్నీరు ఒలికించేది. ఈరోజు ఎవరి ముందు ఒలికిస్తుంది!

శ్రీపతిరావుకు ముగ్గురు కొడుకుల తరువాత పుట్టినది దేవయాని. ఆయనకు, ఆయనభార్యకు ఆడపిల్లలు అంటే అంతా దోచుకుపోయేవారని, మగపిల్లలంటే వంశాన్ని ఉద్ధరించేవారని ఒక అభిప్రాయం. ముగ్గురు మగబిడ్డల తరువాత పుట్టిన దేవయానికి మరో ఇంట్లో అయితే అపురూపంగా జరిగేది. ఈ ఇంట్లో ఆమెను ఒక భారంగా భావించారు.

"లక్ష్మీ, మనకు ఈ అమ్మాయి, అబ్బాయి అయితే స్మశానానికి మోయ టానికి మరో మనిషి అవసరం ఉండేది కాదు." అంటూ ఉండేవాడు. దేవయాని పెరిగినకొద్దీ కొన్ని విషయాలు అర్థం చేసుకుంది. జన్మనిచ్చిన తల్లితండ్రులు ఇంత వ్యత్యాసం చూపటమా!

హరికృష్ణ, మురళీకృష్ణ, రామకృష్ణ ఏదడిగినా నిమిషాలమీద వచ్చేవి. దేవయాని ఏదయినా అడిగితే తండ్రి ఖర్చుల లిస్ట్, తల్లి 'మగబిడ్డలతో వంతేమిటే' అని చదివేది.

మళ్లీ ఏనాడూ తన కోరికను బయట పెట్టలేదు. పదవతరగతి ఫస్ట్‌క్లాసులో పాసయింది దేవయాని.

ట్యూషన్లుపెట్టి, రాత్రింబవళ్లు కష్టపడి చదివించిన అన్నలు హైయ్యరు సెకండ్ క్లాసు, సెకండ్‌క్లాసు తెచ్చుకున్నారు. తను ఫస్ట్‌క్లాసు తెచ్చుకుంటే ఎంత అభినందిస్తారో అనుకుంది.

"పనిలేక ఆడపిల్లలు ఫస్ట్‌క్లాసులే తెచ్చుకుంటారు. ఇంకా చదివించటం అనవసరం. సత్యవతి కొడుక్కు చేసు కుంటానంటుంది. ఆ కుర్రాడికి కట్నం వద్దనే పిచ్చి ఉంది." అని మాట్లాడుకుం టున్న తల్లితండ్రులను చూచి దేవయాని ఒక్కసారి నిలబడిపోయింది.

సత్యవతమ్మ శ్రీపతిరావుకు చిన్నమ్మ కూతురు. అతనికి ఆమె అంటే ఇష్టం. ఆమెకొడుకే పరశురామ్. ఎల్. ఎమ్. ఇ. చేసి భారత్ హెవీ ఎలక్ట్రికల్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అతని ఆశయా లను అందరూ పిచ్చి అంటారు.

కానీ కట్నం లేకుండా దేవయాని వివాహం అతనితో జరిగిపోయింది. అతనిలోని పిచ్చే దేవయానిని ఎం. ఏ. వరకు చదివించింది. ఆమె జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తోంది. ఇద్దరు పిల్లలు తను ఏ వ్యత్యాసానికి భయపడి బాధపడిందో, అది తన బిడ్డల మధ్య తల యెత్తరాదని జాగ్రత్తపడింది. హరి, మురళి, రాము ముగ్గురూ దూరంగా ఉన్నారు. హరి ఢిల్లీలో, మురళి యిరాన్‌లో, రాము అమెరికాలో ఉండి పోయారు. దేవయాని పెళ్లి కాగానే లక్ష్మీ దేవి చనిపోయింది. భార్యనుకోల్పోయిన తండ్రి అంటే విపరీతమైన అభిమానం దేవయానికి.

అతనికి మాత్రం కొడుకులను పొగడటం, వారిగొప్పలు చెప్పటం పూర్తిగా సంతృప్తి నిస్తాయి.

"నీ గురించి రవంత అభిమానంలేని మనిషికి సేవచేస్తావెందుకు!" అంటాడు పరుశురామ్.

"అభిమానానికి రూపం లేదు. అది కొలవలేము" అని అతని మాటలు తీసి వేసేది!

వెళ్లి అతనికే అవసరం వచ్చినా తనే అడుకునేది. ఓ రోజు వెళ్లేసరికి శ్రీపతిరావు కోపంగా ఉన్నాడు.

"చూడమ్మా, ఈ నల్లభైగజాల స్థలం ఆ ప్రక్కవారిదట. పాత ఆస్తులు కొనట మంత బుద్ధితక్కువ లేదు," అన్నాడు.

"అక్కడ మనము గదులు వేసాం కదనాన్నా."

"అదేనమ్మా, ఆ మాటంటే ఆ స్థలానికి ధరకట్టారు. గజానికి వందరూపాయలట. నేనెక్కడ తేను...." అన్నారు బాధగా.

ఏం చేయాలో తోచలేదు. నాలుగు వేల రూపాయలు. సాయంత్రం కాలేజికి ఫోన్ వచ్చింది. ఫ్యామిలీడాక్టర్ చేసాడు.

"దేవీ! ఈ బాదరబందీ ఏదీ వద్దంటే వినరేం? ఆ పెద్దమనిషికి పిచ్చి పెరిగింది. పోతే పోనియ్యండి మీ ఆరోగ్యంకంటే యెక్కువా అన్నా వినడు...." అన్నాడు కోపంగా.

"ఏం చేయమంటారు డాక్టరుగారూ!"

"ఏదో ఒకటిచెయ్యి. మీఅన్నల దగ్గర నుండి డబ్బువస్తుందని నమ్మకంగాచెప్పు. మీరు నల్గురూ సెటిల్ అయ్యారు. హాయిగా ఉండకూడదూ...." ఆయన విసుక్కుని ఫోన్ పెట్టేసాడు.

కాలేజినుండి సరాసరి తండ్రిదగ్గరకు వెళ్లింది. ప్రక్కవారు వచ్చి కూర్చు న్నారు.

"చూడండి రావుగారూ! మీ అబ్బా యిలు రావాలంటే నెలలు పడుతుంది. డబ్బివ్వండి, లేకపోతే...." వారిమాటలు పూర్తికాకముందే దేవయాని కల్పించు కున్నది.

"అంతంత మాటలెందుకు! ఇదిగో చెక్కు," నాలుగువేలకు వ్రాసిచ్చింది. వాళ్ల రసీదు వ్రాసిచ్చి వెళ్లిపోయారు.

"మీ పరువుకంటే ఆ డబ్బు ముఖ్యం కాదు నాన్నా! వజ్రాల దిద్దులు కొనాలని చీటీ కట్టాను. ఆ చీటీడబ్బే. ఆరునెలలు ఆలస్యంగా కొంటాను." అన్నది ఓదార్పుగా.

మర్నాడు తండ్రి స్థితి బావుందని డాక్టరు చెప్పినప్పుడు ఆమె చాలా సంతో

షించింది. తను ఒక ఉపయోగమయిన పని చేసింది. అన్నలు తప్పక అభినందిస్తారనుకుంది.

హరి ఈ విషయం విని తండ్రిని నాలుగు దులిపాడు.

"ప్రక్కింటివాడే మగాడా నాన్నా! ఇంకా పదేళ్ళయినా హాయిగా కోర్టుల చుట్టూ తిరిగేవారం" అన్నాడు. ఆ తరువాత డబ్బువిషయం యెత్తనే లేదు. అతను వెళ్ళిపోయాక తండ్రి విసుక్కున్నాడు, "కోర్టులకెళ్ళటం అంటే సినిమా అనుకుంటున్నాడు. మురళితో ఇప్పిం చేస్తాను. తొందరపడ్డావేమో".

"అదేం మాట నాన్నా! మీకు రోజూ తలనొప్పి ఉండేదిగా" అన్నది. రెండు నెలలకు యిరాన్ నుండి మురళి వచ్చాడు ఒకరోజు తండ్రి విషయం చెప్పాడు.

"నాన్నా! ఇంటికి ఖర్చుపెట్టావు. ఆ వచ్చే అద్దెతో అప్పు తీర్చండి. నాకు అనవసర విషయాలు చెప్పొద్దు." అని లేచి వెళ్లాడు.


"గొప్పకోసం కాకపోతే అమె నెవరు ఇవ్వమన్నారు." మురళి భార్య కోమల అనటం దేవయాని చెవుల్లో పడ్డది.

మనుషులకు తార్కికజ్ఞానం నశించిందా! ఏమో .... అలా మరో ఆరు నెలలు గడిచాయి. శ్రీపతిరావుకు రెండు సార్లు జబ్బుచేసింది. రెండుసార్లు నెల రోజులు సెలవలుపెట్టి తండ్రి దగ్గర ఉండిపోయింది దేవయాని.

ఆయనకు తృప్తి లేదు. అనుక్షణం కొడుకులుంటే ఇంకా పెద్దడాక్టరుకు చూపించేవారని అనుకుంటుంటాడు. అది విన్నప్పుడల్లా పరశురావ్, దేవయాని వంక కొరకొర చూస్తాడు. అతను వద్దని వారించలేడు. కొందరు తమ వాళ్లను రానిచ్చి సేవచేసి, అత్తగారివైపు బంధువులను వద్దంటారు, దేవయాని

మామూలు సంఘటన!

సినిమాలో యిలా చూస్తాం!!




ఈరోజు తండ్రికి చేసినట్టే, మామగార్కి చేస్తుంది.

తండ్రిని చూడాలని రాము వచ్చాడు. అతనికి నాలుగువేలు గొప్పకాదు కానిఅది వదులుకునే గొప్పహృదయం ఉండాలి.

అతను దేవయాని ఇంటికి భోజనానికి వచ్చాడు. వెళ్తూ, తను తెచ్చిన వాచీ ఆమెకిచ్చాడు.

"చూడు దేవీ! నువ్వు నాలుగువేలిచ్చావని నాన్న చెప్పాడు. కాని ఐ దోంట్ అప్రిషియేట్. కేసు కొట్లాడాల్సింది."

"ఆ ఓపిక నాన్నకెక్కడి దన్నయ్యా! నాన్న పరిస్థితి డాక్టరును అడుగు."

"లెటిట్ గో....ఒక్కసారిస్తే నాన్న చేసే అవకతవక ఖర్చులకు నువ్విస్తావు. నేను ఇవ్వను."

"దట్స్ ఆల్ రైట్ అన్నయ్యా."

అతను వెళ్ళిపోయాడు. శ్రీపతిరావు ఒక్కసారి బాధపడ్డాడు. "పోన్లే నాన్నా! నేను నీకూతుర్నే కదా! ఇప్పుడేమయింది నీ ఆరోగ్యానికన్నా, నీ అనుభూతి ముఖ్యంకాదు" అన్నది.

ఆ తరువాత ఆ విషయమే మరిచిపోయింది. అప్పుడప్పుడు పరశురామ్ హేళన చేసేవాడు.

"ఏమిటో వెర్రి అభిమానం. మా పెద్దవాడు నా కిష్టమని యెవరు వచ్చినా కలకత్తా స్వీట్స్ పంపుతాడు."

"ఇదిగో ఈ నేల్ కట్టర్ మా రాము పంపాడు. నా కెందుకురా అంటే ఈ స్వీటులిచ్చి పోయాడు."

"మా మురళి పైకిచూస్తే యెంతో పొదుపరిలా కనిపిస్తాడు. పిచ్చిసన్యాసి. ఉన్నన్ని రోజులు రోజుకు వదిరూపాయలుపెట్టి పళ్లుకొంటాడు," అని తండ్రి అరిగిపోయిన రికార్డులా అందరి దగ్గర చెప్పేవాడు.

"మరిచిపోయి కూడా 'మా అమ్మాయి' అన్నమాట మీనాన్ననోటరాదు. అలాంటి నాన్నను పట్టుకుని ప్రాకులాడుతావేం!"

"ఆయన అనాలని చెయ్యటం లేదు. యెవరి ఆనందం వారిది. మీ అమ్మ మీ చిన్నతమ్ముడి గుణగణాలే రామాయణ కీర్తనలా పాడుతుంది....."

"అబ్బబ్బ చాల్లే." అనేవాడు పరుశురామ్.

వాదనకోసం భర్తను అలా అన్నా ఆమె మనసు పీకుతూ ఉండేది. అది మనిషికి ఉండే బలహీనత. వీటన్నిటికి

అతీతంగా యెదిగిపోవాలని ఆమె తపన పడేది.

ఆదే సమయాన ఒక డాక్టరుగారు వ్యంధ్యచికిత్స చేస్తానని కేరళనుండి దిగాడు. అతను దేవయాని కొలీగ్ అన్న.

"దేవీ! మీ ఇల్లు పెద్దహాలుతో ఉంది. అక్కడయితే ఓ పదిరోజులు అన్నీ హాయిగా ఉండొచ్చు" అని అడిగింది.

"మా ఇల్లా! అంత చిన్న వరండాలో పేషెంట్లే పట్టరు."

"మీ ఇల్లు అంటే మీ నాన్నగారి దోయ్" అన్నది.

"ఆయన ఒక్కరే కదా, అడుగుతాను." అన్నది దేవయాని. మళ్లీ ఆమె రెట్టించటంతో తండ్రి దగ్గరకు వచ్చింది.

"నాన్నా! నా స్నేహితురాలు కన్నమ్మపోతన్ అని ఉంది. వాళ్లన్న పిల్లలు కానివారికి మందులు ఇస్తుంటాడు. వారానికి అయిదురోజులు బయట బస చేస్తారు. ఈసారి హైద్రాబాద్ వచ్చారు. మన ఇల్లయితే కాస్త హాలు పెద్దగా ఉంటుందని...."చెప్పబోయింది.

"దాందేముందమ్మా, అలాగే కానియ్యి, ఇల్లంతా పడి దొర్లుతానా!" అన్నాడు నవ్వుతూ.

కన్నమ్మతో చెప్పింది దేవయాని. కన్నమ్మపోతన్ చాలా సంతోషించింది. అంతవరకు అలా ఊరూరా తిరిగే డాక్టర్లు అంటే వారు ఒక్కరే వస్తారు అనుకుంది దేవయాని.

డాక్టరు తన మందీమార్బలం పది పన్నెండు మందితో వచ్చాడు. వెంట సామాన్లుకూడా వేసుకువచ్చారు. గర్భకోశ దోషాలకు చిన్న చిన్న అపరేషన్లు అవి చేస్తారట.

అనుకోకుండా ఢిల్లీనుండి హరికృష్ణ వచ్చాడు. తండ్రివి నానామాటలన్నాడు.

"ఇల్లు ధర్మసత్రమా!"

"ఓహో! పెరిగిన కొడుకులు అంటే గౌరవం లేదా!" అంటూ.

శ్రీపతిరావుకు మురళీ దగ్గరున్న చనువు హరిదగ్గర లేదు. "అబ్బే నాకేం తెలియదురా. అంతా అమ్మాయే చూసుకుంది. నన్ను అడగలేదు." అన్నాడు శ్రీపతిరావు.

హరికృష్ణ వచ్చి దేవయానిని నిలదీస్తే, అదేమిటని ఆశ్చర్యపోయింది. ఛ.... నాన్న అంగీకరిస్తేనే డాక్టరును ఉంచానన్నయ్యా."

"ఇప్పుడు నాకిష్టం లేదు. వెంటనే ఖాళీ చేయించు. యిదేం బజారు కొంపా!" అన్నాడు.

దేవయానికి సాయంత్రంవెళ్లి శ్రీపతిరావుని అడిగింది.

"అదేమిటి నాన్నా! అన్నయ్యతో అలా చెప్పావు? నన్ను అడగలేదా?"

"అడిగావు కాని, వాడు నిలదీస్తేనాకాళ్లూ చేతులు వణికాయితల్లీ. నాకు చావెందుకు రాదో......."

తండ్రి అసహాయస్థితిలో అనేమాట అది. దేవయానికి ఏం పాలుపోలేదు.

"నాన్నా! వాళ్లను వెళ్లమంటే సభ్యతగా ఉంటుందా. ఆరురోజులు గడిచాయి. మరో నాల్గురోజులు ఓపికపడితే...."

"ఒత్తి మళయాళ మేళమే తల్లీ అంటే నీకు కోపంవస్తుంది. వాళ్లగోల, రోగుల సందడి చూస్తుంటే....ఛీ....ఛీ...."

"పిల్లలు కలుగకపోతే వస్తున్నారు. వారేం రోగులుకాదు. అంటువ్యాధులు కావు." దేవయాని నచ్చచెప్పింది.

ఆమెకు తనపైతనకే కోపంవచ్చింది. వెళ్లి కన్నమ్మతో కచ్చితంగా చెప్పింది.

"ప్రజల కోరిక మీద రెండురోజులు యెక్కువ ఉంటారు. ఉన్నపాటున పొమ్మంటే యెలా?"

"కన్నమ్మా! నాకు తెలుసు కాని, నేనూహించింది మీ అన్నగారు ఒక్కరే వస్తారని. మందీమార్బలంతో వస్తారని ఊహించలేదు." అన్నది.

"నాకు అనుభవం లేదు దేవయాని...."

దేవయాని అవారం రోజులు నరక యాతన అనుభవించింది. "డాక్టరుగారిని ఖాళీ చెయ్యమను." అని తండ్రిఫోన్.

"మీ నాన్న నానా మాటలంటున్నారు. పెద్దవారని సహించి ఊరుకుంటున్నాము." అని వాళ్లఫోను.

తిని కూర్చుని ఏం తద్దినం తెచ్చిపెట్టుకున్నారాబాబూ అనుకుని దేవయాని బాధపడని క్షణం లేదు.

డాక్టరుగారు ఖాళీచేసారని వార్త వచ్చింది. దేవయాని వెళ్లింది. "గోడలకు నీళ్లు కొట్టారు, గుచ్చూడిపోయింది. అబ్బబ్బ! జనం పెరడు పాడుచేసారు." అంటూ శ్రీపతిరావు చెప్పాడు.

పీలయినంతవరకు బాగుచేయించింది. మర్నాడు కాలేజికివెళ్తే గంపెడు చేపలు తిన్న గండుపిల్లిలా ముఖంపెట్టింది కన్నమ్మపోతన్.

"మనుష్యుల్ని చూచి మోసపోతాం. మాట్లాడుతుంటే తీయగా ఉంటాయి. చదువుకున్నా సంస్కారం ఉండదు. సహికరిస్తే, ఒకరింట్లోఉండి డబ్బు సంపాదించాం అని అద్దె ఇచ్చేవారం. మాటలు పడి అద్దె యెందుకివ్వాలి!" అన్నది.


దేవయాని తలపైనుంచి పెద్ద భారం దిగినట్టు నిట్టూర్చింది. మళ్లీ ఇలాంటి వాటిల్లో ఇరుక్కోవద్దని లెంపలు గట్టిగా వాయించుకుంది.

ఆరోజు సాయంత్రం తండ్రికి పళ్లు తీసుకునివెళ్లింది.

"అందరూ నన్ను ఏమడుగుతున్నారో విన్నావుటే అమ్మాయ్! ఈ డాక్టరు రోజుకు రెండు వందల అద్దె ఇచ్చాడంటున్నారు."

"యెవరికిచ్చారట...." తీక్షణంగా చూచింది. ఆ క్షణంలో ముఖం దాచుకో

వటానికి యెక్కడాస్థలం లేదనిపించింది. కన్నతండ్రి, డబ్బంటే తనెంతదూరంగా ఉంటుందో, లెక్కలంటే ఎంత కచ్చితంగా ఉంటుందో తెలిసిన తండ్రి, ఆ మాట అనగలిగాడంటే ఆ అద్దె తను తీసున్నట్టేఅనుమానించాడేమో? దేవయానికి ప్రపంచంలో యెవరూ తనవారు కారనిపించింది. ఈ విషయం భర్తతో చెబితే ఇంకా ఏమయినా వున్నదా!



మూడు నెలలు తిరక్కుండానే శ్రీపతిరావు కొడుకులను పిలిచి ఉన్న కొద్దిపాటి ఆస్తి పంచి ఇచ్చాడు.

"నీకు కట్నకానుక లిచ్చారా! ఏమీ ఇవ్వరా! మీ అమ్మనగలయినా ఇవ్వరా!" అని ఆడబడుచు అత్తగారు గుర్తుచేసారు.

"అభిమానం కరువయ్యాక, డబ్బు, నగలు ఎందుకు!" అనుకుంది విరక్తిగా. వాళ్లు వచ్చినందుకు పలుకరించాలని, వెళ్లి పలుకరించి, తన ఇంటికి ఆహ్వానించింది.

ముగ్గురూ ఏకమయి నిలదీసారు.

"ఇల్లు ఆస్పత్రికి ఇవ్వడానికి నీకేం హక్కుఉంది?" అన్నారు.

"అన్నయ్యా!" అన్నది ఆవేదనగా. వాళ్లలా నోరు జారాలంటే తనూ జారగలదు! నాన్నను ఒంటరిగా వదిలిపోతే చూచేహక్కు ఉన్నట్టే, నాన్నకష్టాలలో ఆదుకునే హక్కుఉన్నట్టే ఈ హక్కు ఉంది అనగలదు.

కాని అసలయిన వ్యక్తే పక్షపాతం వహించాడు. వాళ్లి విషయాలను రెట్టించినప్పుడు తండ్రి కలుగజేసుకుంటే బావుండేది.

"ఏరా! ఇల్లు బావురుమంటుంటే, నాల్గురోజులు ఇచ్చిందేమో. మీలా అదీ పుట్టలేదా!" అంటే వాళ్లదగ్గర జవాబు లేదు. వాళ్ల అలా అడగటానికి అస్కారం ఇచ్చిందికూడా తండ్రే. తల్లితండ్రులు చిన్నచూపు చూచిన పిల్లలు సమాజంలోను. బంధువులలోను చిన్న చూపు చూడబడతారు. ఆ నిజం తనకు బాగా తెలుసు.

దేవయానికి దుఃఖం తన్నుకు వస్తుంది. తన కన్నీటికి కరిగేవారు యెవరూ లేరు. తన అన్నల సంగతి బాగా తెలుసు. తమకు చీమకుట్టినా అది బాధే. ఇతరులకు తేలుకుట్టినా పరిహాసమే. "చాలయిందిలేమ్మా ఏడ్చావ్ గాని" అంటారు.

ఏ చిన్న విషయానికి వాళ్లలో వాళ్లకు తగాదావస్తే గంటల తరబడి చెబుతారు. కొంపలంటుకుపోయినట్టు బాధపడతారు.

"చాలయింది లేవయ్యా!" అనాలనిపిస్తుంది. కాని తనొక బాధ్యత కల్గిన అధ్యాపకురాలు. అంత స్వార్థానికి దిగజారలేదు. నిజమే వారడిగింది నిజమే. టిట్ ఫర్ ట్యాట్ అని ఉండాలి. ద్వేషించేవారివి, హేళన చేసేవారిని, నిర్లక్ష్యంచేసేవారిని, ప్రేమించటంతనదే బుద్ధి తక్కువ. తనహక్కుకోసం తను పోరాడకపోవటం తెలివిమాలిన పని.

చాలాసేపు అలాగే కూర్చుంది దేవయాని. ఈ చిన్నసంఘటన తనకు మనఃస్తాపం కలిగిస్తే కల్గించింది కాని, 'హక్కు' అని ఆధిక్యత చూపుకుని, తండ్రి బాధ్యతనుండి విముక్తురాలిని చేసారు.

"భగవాన్; నాకు పూజచేసే అలవాటు లేదు. నువ్వంటూ ఉంటే, అనుబంధాల నుండి ప్రేమనుండి కూడా విముక్తురాలిని చెయ్యి." అంటూ నమస్కరించింది.

———